## క్లుప్తంగా

### వైభవుడికి సుప్రభాత సేవ నేడు


వైభవ వేంకటేశ్వరస్వామి

**మురళీనగర్:** కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

### నేడు 'ఇంద్రప్రస్థం' నాటిక ప్రదర్శన

**మురళీనగర్:** మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక, కళారూపాలకు ప్రోత్సాహంలో భాగంగా శనివారం ఇంద్రప్రస్థం సాంఘిక నాటిక ప్రదర్శించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ప్రాంగణంలో స్నిగ్ధ రచించిన ఈ నాటికను ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో సాయంత్రం 6.30 గంటలకు ప్రదర్శిస్తారన్నారు. ఈ నాటిక అనేక పరిషత్ పోటీల్లో ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శన బహుమతులు సాధించిన గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ సమర్పిస్తున్నట్లు చెప్పారు.

### ఉమా నీలకంఠేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం


ఉమానీలకంఠేశ్వరుని జలంతో అభిషేకిస్తున్న అర్చకులు, భక్తులు

**సీతమ్మధార:** ఉమా నీలకంఠేశ్వరునికి సహస్ర ఘటాభిషేకాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని స్థానిక ఆలయంలో ముందుగా గణపతి పూజ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు 1008 బిందెల జలాలతో స్వామిని అభిషేకించారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో బర్ల బాలకృష్ణ, బోర రవికుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### కొండవాలులో అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, మహిళలు

**కంచరపాలెం:** జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడ కొండవాలు ప్రాంతంలో అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జోన్–5 ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, ఏఈ అర్చన, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### 1న ప్రజారోగ్య వైజ్ఞానిక సదస్సు

**కంచరపాలెం:** కంచరపాలెం డాక్టర్ కె.ఎస్.ఆర్. వైద్యశాలలో డిసెంబర్ 1న ప్రజారోగ్య వైజ్ఞానిక సదస్సు నిర్వహించనున్నట్లు పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ–దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు రోగులకు ఉచితంగా మందులు, వివిధ వస్తువులు, పౌష్టికాహారం పంపిణీ చేస్తామని చెప్పారు. డిసెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే సదస్సుల్లో ఉచితంగా ఆరోగ్య పరీక్షలకు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.



# అంధకారం

- 51వ వార్డులో వెలగని వీధిలైట్లు
- పలు కాలనీల్లో చిమ్మచీకట్లు
- ఇబ్బందులు పడుతున్న కాలనీల వాసులు
- కన్నెత్తి చూడని అధికారులు


రాజీవ్‌నగర్ జంక్షన్‌లో ఆరి, వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు


గాంధీనగర్‌లో వెలగని వీధిలైటు


కళింగనగర్‌లో వెలగని వీధిలైటు

**మల్కాపురం:** జీవీఎంసీ 51వ వార్డులో అంధకారం నెలకొంది. పలు కాలనీల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగక చీకట్లు రాజ్యమేలుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం.. నిర్వహణ లోపంతో ఈ పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 51వ వార్డులోని పలు ప్రాంతాల్లో మూడు నాలుగు నెలల నుంచి వీధిలైట్లు, హైమాస్ట్ లైట్లు వెలుగులివ్వకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డులో వీధి దీపాల నిర్వహణను అధికారులు, సిబ్బంది గాలికొదిలేయడంతో ఎప్పుడు ఆరిపోతాయో, ఎప్పుడు వెలుగుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

**అధ్వానంగా వీధిలైట్ల నిర్వహణ**

వార్డులోని రాజీవ్‌నగర్, గాంధీనగర్, కళింగనగర్ వుడా క్వార్టర్స్, ఎంఎస్ఆర్ పార్కు ఏరియా, పార్కు లోపల, మహత్ కాలనీ, మాధవ స్వామి జలధారకు వెళ్లే మార్గం.. ఇలా పలు చోట్ల వీధిలైట్లు వెలగడం లేదు. మరి కొన్నిచోట్ల వెలుగుతూ, ఆరుతూ ఉన్నాయి. ఒకసారి వెలిగితే మరోసారి వెలగవు, కొన్ని చోట్ల ఆరుతూ, వెలుగుతుంటాయి. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని నివాసులు వాపోతున్నారు. ఎంఎస్ఆర్ పార్కులో హైమాస్ట్ లైట్లు ఒక పక్క వెలిగితే.. మరోపక్క వెలగక అక్కడ ఆడుకుంటున్న పిల్లలు, పెద్దలు, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.

**అధికారులు చర్యలు చేపట్టాలి**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీధిలైట్ల సమస్యలు లేవని, ఒకవేళ ఉన్నా వెంటనే పరిష్కరించేవారని పలువురు స్థానికులు చెబుతున్నారు. వీధిలైట్ల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మండిపడుతున్నారు. వార్డులో పలుచోట్ల రాత్రిళ్లు చీకటిగా ఉండటంతో ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు చేపట్టాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

## వార్డుల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- అక్కయ్యపాలెంలో పర్యటన


అక్కయ్యపాలెంలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


దోమలు పెరిగే ప్రదేశాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ తిలకిస్తున్న కమిషనర్

**సీతంపేట:** వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శానిటరీ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిత్యం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. జీవీఎంసీ 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం, చిన్నూరు, ఎన్జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణితో కలిసి ఆయన శుక్రవారం పర్యటించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఇంటింటి నుంచి వ్యర్థాలను సేకరించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. వార్డు పరిధిలో మౌలిక సదుపాయాలు, కాలువల నిర్మాణం, తాగునీటి సమస్యలను కార్పొరేటర్ శ్రావణి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ కాలువల నిర్మాణానికి, పబ్లిక్ కుళాయిల ఏర్పాటుకు, అంగన్‌వాడీ, జీవీఎంసీ హైస్కూల్ మరమ్మతులకు ప్రతిపాదనలు ఇవ్వాలని కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్‌ను కమిషనర్ ఆదేశించారు.

**వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి**

వార్డులో గెడ్డలు, కాలువలను కమిషనర్ పరిశీలించారు, వ్యర్థాలను ఎప్పటికప్పుడు మిషన్లతో తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఎన్జీజీవోస్ కాలనీ లేఅవుట్‌లో ఖాళీ స్థలాన్ని వినియోగంలోకి తేవాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం చిన్నూరులో మలేరియా విభాగం ఏర్పాటు చేసిన మలేరియా, డెంగ్యూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలపై ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి బి.ప్రసాదరావు, ఏసీపీ సి.హెచ్.మధుసూదన్‌రావు, వార్డు కార్యదర్శులు, టీడీపీ నాయకుడు ముక్కా కిషోర్ పాల్గొన్నారు.

## పోటాపోటీగా వాకర్స్ క్లబ్ ఎన్నికల ప్రచారం

బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాల వెల్లడి

**మురళీనగర్:** మురళీనగర్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ గురువారంతో ముగిసిన నేపథ్యంలో బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను ఎన్నికల అధికారి నిమ్మగడ్డ బుచ్చయ్య అధికారికంగా ప్రకటించారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, జాలీవాకర్ పోస్టులతో పాటు 9 మంది బోర్డ్ డైరెక్టర్ల పోస్టులకు సంబంధించి అభ్యర్థుల వివరాలను ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడు, బోర్డ్ డైరెక్టర్ల పోస్టులకు పోటీ నెలకొంది. అధ్యక్ష పదవికి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సబ్బినేని రామ్మోహనరావు, మానవ సేవే మాధవ సేవ గౌరవాధ్యక్షుడు సనపల భానుప్రకాష్ బరిలో నిలిచారు. 9 బోర్డ్ డైరెక్టర్ల పోస్టులకు 12 మంది పోటీలో ఉన్నారు. కొలుకులూరు వెంకటవర్మ, అట్లూరి వీరబాబు, గొల్జాన రామకృష్ణ, మాచిరాజు నారాయణరావు, కోన శివరామకృష్ణ ప్రసాద్, సూరెడ్డి శ్రీనివాసరావు, ఎల్లేటి నూకరాజు, పైడి గిరిధరబాబు, ద్వారపూడి సతీష్, కొడవటి అచ్యుత రామకృష్ణారావు, సాల సర్వరాజు, బడాద శేఖర్ డైరెక్టర్ పోస్టులకు పోటీ పడుతున్నారు.

**వీరి ఎన్నిక ఏకగ్రీవం..**

ఉపాధ్యక్షురాలిగా గొల్జాన విజయలక్ష్మి, కార్యదర్శిగా చొల్లంగి సత్య సూర్యప్రసాదరావు, సంయుక్త కార్యదర్శిగా నానుపాత్రుని ప్రకాశరావు, కోశాధికారిగా రోణంకి నాగేశ్వరరావు, జాలీ వాకర్‌గా నానుపాత్రుని మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి పోటాపోటీగా ప్రచారం సాగుతోంది. సభ్యులందరిని కలిసి తనను గెలిపించాలని అభ్యర్థులు కోరుతున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఎక్కువ సార్లు అధ్యక్షుడితోపాటు మొత్తం కార్యవర్గం ఎన్నిక దాదాపు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ సారి కీలకమైన అధ్యక్షుడి ఎన్నికను అభ్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు.

**8న క్లబ్ ఎన్నికలు, ఫలితాలు**

డిసెంబర్ 8వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి, విజేతల వివరాలను సాయంత్రం ప్రకటిస్తామని ఎన్నికల అధికారి బుచ్చయ్య చెప్పారు. క్లబ్‌లో 877 మంది సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

## కార్మికుల కోసం నిలబడతాం

ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జనరల్ సెక్రటరీ పట్నహాని


సభలో మాట్లాడుతున్న రామమోహనరావు

**తాటిచెట్లపాలెం:** కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ, కార్మికుల పక్షాన నిలబడే ఏకైక యూనియన్ ఈస్టుకోస్టు రైల్వే శ్రామిక్ యూనియన్ అని యూనియన్ జనరల్ సెక్రటరీ పి.కె.పట్నహాని అన్నారు. ఈస్టుకోస్టు రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మల్కాపురం రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కన నిర్వహించిన భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. గుర్తింపు యూనియన్ కోసం డిసెంబర్ 4, 5 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఎన్నికల్లో శ్రామిక్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. యూనియన్ డివిజనల్ కో–ఆర్డినేటర్ పి. రామమోహనరావు మాట్లాడుతూ కార్మికులంతా సంఘటితమై, చక్రం గుర్తుపై ఓటేసి శ్రామిక్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. సభలో ప్రజానాట్యమండలి వారి విప్లవగీతాలు, తప్పెటగుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈస్టుకోస్టు రైల్వే శ్రామిక్ యూనియన్ వాల్తేర్ డివిజన్ నాయకులు, ఆయా బ్రాంచిల కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## పోర్టు ఆస్పత్రి టెండర్ అడ్డుకుంటాం


పోర్టు హాస్పిటల్ వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

**తాటిచెట్లపాలెం:** పోర్టు హాస్పిటల్ టెండర్ పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుని తీరుతామని సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ స్పష్టం చేశారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హాస్పిటల్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 60వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను సొంత నిధులతోనే అభివృద్ధి చేసి నిర్వహించాలన్నారు. సుమారు 40 వేల మంది కార్మికులకు వైద్య సేవలందించే ఆస్పత్రిని ప్రైవేటుకు అప్పగించడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, బి.లక్ష్మణరావు, రామలింగేశ్వరరావు, సిహెచ్.త్రినాథరావు, కె.ఎస్.కుమార్, శ్రీను, రాఘవులు, కె.విజయారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాస శివరాత్రి పూజలు


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

**సీతంపేట:** కార్తీక మాసం, మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం శంకరమఠం రోడ్డులోని రామలింగేశ్వరాలయంలో స్వామికి ఘనంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా అభిషేకం జరిపించారు. రామలింగేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శ్యామల దీపిక, పి.ఉషాకిరణ్, ముక్కా శ్రావణి, నరవ రాంబాబు, భరత్ స్వామి, కాళ్ల సూర్యప్రకాష్, బొడ్డేటి రవికుమార్, కర్రి జగన్నాథరావు, దాసరి పరశురామయ్య, జయరాం, సబ్బిశెట్టి జగన్ పాల్గొన్నారు. ఆలయ ఈవో జి.వి.రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## పనిమనిషి గంగకు న్యాయం చేయాలి

హోం మంత్రికి సీఐటీయూ వినతి


హో మంత్రి అనితకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు వెంకటరావు, మణి

**సీతమ్మధార:** సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో పని చేస్తున్న గంగకు న్యాయం చేసి, నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరారు. సీఐటీయూ ఇంటి పనివారి సంఘం ఆధ్వర్యంలో నక్కపల్లిలో శుక్రవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆమెకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పి.మణి, పి.వెంకటరావు మాట్లాడుతూ అన్యాయంగా గంగను కొట్టిన ఎంవీపీ ఎస్ఐ నరవ జగదీష్‌పై కేసు నమోదు చేయాలని, ఫ్లాట్ ఓనర్ ప్రియాంక వ్యవహార శైలిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. హోం మంత్రి స్పందిస్తూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో మాట్లాడి న్యాయం చేస్తామని, నష్ట పరిహారంపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలుమార్లు కలెక్టర్‌ను కలిసి నష్టపరిహారం గురించి మాట్లాడిన విషయం, గంగకు తగిలిన గాయాల తీవ్రతను హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సిటూ నాయకులు తెలిపారు. గంగకు జరిగిన అన్యాయం మరో మహిళకు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు, ఇంటి పని వారి సంఘం జిల్లా నాయకులు దేవి, జయ, పద్మ, బాధితురాలు గంగ అన్నయ్య శంకరరావు పాల్గొన్నారు.

### ఎరుకుమాంబ ఆలయంలో దీపాలంకరణ



**సీతమ్మధార:** దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి శుక్రవారం దీపాలంకరణ చేశారు. ఆలయ ఈవో జి.వి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు జరిగాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### దుర్గమ్మ సన్నిధిలో అన్నదానం


మాలధారులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ప్రణవ్ గోపాల్ తదితరులు

**సీతమ్మధార:** స్థానిక 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతిస్వరూపిణి దుర్గమ్మవారి ఆలయం ఆవరణలో కేఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సారిపల్లి గోవింద్, గుడ్ల సత్యారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉమా మహేశ్వరరావు, బర్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రైతుబజారులో 63 స్టాళ్లకు డ్రా


డ్రా తీసిన స్టాల్ నంబర్ టోకెన్ ఇస్తున్న ఈవో కొండబాబు

**సీతమ్మధార:** సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం 63 రైతుల స్టాల్స్‌కు డ్రా తీశారు. ఉదయం రైతుల కార్డులు 90 రాగా, 63 స్టాల్స్‌కు డ్రా తీశారు. సాయంత్రం 63 స్టాల్స్‌కు 82 కార్డులు వచ్చినట్లు ఈవో కొండబాబు తెలిపారు. డ్రా తీసిన టోకెన్లను ఈవో రైతులకు అందజేశారు. ఈవో మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రైతుల స్టాల్స్‌కు సంబంధించి డ్రా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


వినియోగదారులకు, రైతులకు ప్లాస్టిక్ సంచులపై అవగాహన కల్పిస్తున్న ఏఎంవోహెచ్ దుర్గా ప్రసాద్

**సీతమ్మధార:** ప్లాస్టిక్ నిషేధంపై సీతమ్మధార రైతు బజార్ వద్ద వినియోగదారులకు ఏఎంవోహెచ్ దుర్గాప్రసాద్ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడడం వలన క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడతారన్నారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి ఇచ్చి మన విశాఖపట్నంను సుందర నగరంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎవరూ ప్లాస్టిక్ సంచులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది, శానిటేషన్, మలేరియా సిబ్బందితో పాటు రైతుబజార్ ఈవో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## గాయపరిచిన వ్యక్తికి రెండేళ్ల జైలు

**విశాఖ లీగల్:** ఒక వ్యక్తిని గాయపరిచిన నేరానికి గానూ ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె.గాయత్రి శుక్రవారం తీర్పునిచ్చారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేకుల జగదీశ్వరరావు తెలిపిన వివరాలివీ.. నిందితుడు రౌతు సతీష్ కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి కైలాసపురం శాంతిపురంలో ఉంటున్నాడు. బాధితుడు పూడి సత్యనారాయణ పోర్టు ట్రస్టులో పనిచేస్తూ.. ఇదే ప్రాంతంలో నివసిస్తున్నాడు. కాగా.. సతీష్ ప్రతి రోజూ పూటుగా మద్యం సేవించి ఇతరులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో 2017 ఏప్రిల్ 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో సత్యనారాయణతో ఘర్షణ పడ్డాడు. తనతో పాటు తెచ్చుకున్న కర్రలు, ఇనుప రాడ్లులతో చంపుతానని బెదిరించి గాయపరిచాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు సత్యనారాయణను సమీప పోర్టు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కార్పొరేట్ హాస్పటల్‌కు తరలించి చికిత్స అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 307, 506 కింద కేసులు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

## ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం


ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

**విశాఖ సిటీ:** నగర పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఎస్ఐ కె.ధర్మారావు, ఆర్ఎస్ఐ ఎస్.మురళీకృష్ణ, ఏఆర్ఎస్ఐ (వీఆర్) కె.గురయ్యబాబు, హెచ్‌సీ ఆర్.ఎస్.రామచంద్రరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సీపీ వారిని కుటుంబ సభ్యులతో సమావేశ మందిరానికి ఆహ్వానించారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు. సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపి, వారి కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారుల సమక్షంలో సన్మానించారు.

## రైల్వే సిబ్బందికి ప్రశంసలు


ప్రమాదం తప్పించిన రైల్వే సిబ్బందిని సత్కరిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు

**తాటిచెట్లపాలెం:** వాల్తేర్ డివిజన్ పరిధిలో పనిచేసే సిబ్బంది అప్రమత్తతతో పెనుప్రమాదాన్ని తప్పించారు. ఈ సందర్భంగా వీరిని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు ప్రశంసించారు. వివరాలిలా.. ఇటీవల వాల్తేర్ డివిజన్ కోరాపుట్–రాయగడ లైన్, కాకిరిగుమ–లక్ష్మీపూర్ రోడ్ బ్లాక్ సెక్షన్ పరిధిలో జ్ఞాన్ రంజన్ గిరి, చంద్రయ్ తుడులు తమ విధులు నిర్వర్తిస్తున్నారు. అదే సమయంలో ఈ మార్గంలో గూడ్స్ రైలు ప్రయాణిస్తుంది. దానిపై ఏదో వస్తువు వేలాడటం వారు గమనించారు. వెంటనే రైలు మేనేజర్(గార్డ్)కు సమాచారం అందించడంతో గార్డు, లోకో పైలట్‌కు సమాచారం చేరవేసి రైలును ఆపి ఆ వస్తువును తొలగించారు. లేని పక్షంలో దీని వల్ల రైలు పట్టాలు తప్పి పెద్దప్రమాదమే జరిగేదని, దీనిని గమనించి అప్రమత్తతతో వ్యవహరించి, ప్రమాదాన్ని తప్పించిన వీరిని శుక్రవారం డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం మనోజ్‌కుమార్‌సాహూ ప్రశంసించి సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఇ.శాంతారాం, సీనియర్ డివిజనల్ ఆఫీసర్ సిద్ధార్థ ప్రధాన్, సీనియర్ డివిజన్ ఇంజినీర్ డి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్కు రోడ్డులో భవన నిర్మాణ సామగ్రి

**సీతమ్మధార:** భవన నిర్మాణ యజమానులు నిర్మాణ సామగ్రిని రోడ్డుపైనే వేసేయడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ జోన్–3 పరిధి 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేవుట్‌లోని హిల్ పార్కు వెనుక రోడ్డులో భవన నిర్మాణ యజమానులు ఇష్టారాజ్యంగా రోడ్డుకు అడ్డంగా ఇసుక, పిక్క అడ్డంగా వేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోలు, కార్లు వెళ్లే పరిస్థితి లేక, చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ ప్రాంతంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉంటోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.